




నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

గుంటూరు పల్నాడు

మంగళవారం 3 జూన్ 2025 - పేజీలు 8


## పొగరాయుళ్లకు

# నకిలీ సిగరెట్ల సెగ..!!

బ్రాండెడ్‌కు ఏమాత్రం తీసిపోని నకిలీ సిగరెట్ల వ్యాపారం గుంటూరు జిల్లాలో జోరుగా సాగుతుంది. ఇటీవల ఒక వ్యాపారిపై గుంటూరులో విజిలెన్స్ అండ్ ఏన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు చేసి దాదాపు రూ.1.50 కోట్ల విలువచేసే నకిలీ సిగరెట్లు పట్టుకోవటం విశేషం. ఒక్క వ్యక్తి కోటికి పైగా విలువచేసే నకిలీ సిగరెట్లు అమ్ముతున్నాడంటే పరిస్థితి ఎలా ఉందో అవగతం చేసుకోవచ్చు. ఇలా నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యాపారులు గుంటూరు జిల్లాలో కోకోల్లలుగా ఉన్నట్లు తెలుస్తోంది.గత కొన్ని సంవత్సరాల నుండి గుంటూరు జిల్లాలో ఈ వ్యాపారం జోరుగా సాగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఒకప్పుడు పట్టణాల్లోనే ఇలాంటి వ్యాపారం సాగేది. నేడు నకిలీ సిగరెట్లు వికరించే వ్యాపారులు తమ కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరింపజేశారు. ప్రాణాంతకమైన ఈ నకిలీ సిగరెట్లు గ్రామాల్లో కూడా దర్శనమిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ సిగరెట్ల వ్యాపారం జోరుగా సాగుతున్నా పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు కొరియర్లు, పార్శిళ్ల మాటున అక్రమ రవాణాను గుట్టు చప్పుడు కాకుండా బీహార్, గుజరాత్, ఉత్తర ప్రదేశ్. రాజస్థాన్, మహారాష్ట్ర, తెలంగాణ , మయన్మార్ ప్రాంతాల్లో నకిలీ సిగరెట్లు పోసుకుంటున్నాయి. అక్కడ తయారైన సిగరెట్లు గుంటూరు జిల్లాలో జోరుగా అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అన్ని రాష్ట్రాల సరిహద్దులు దాటి సిగరెట్లు గుంటూరు, పల్నాడు, కృష్ణాజిల్లాలోకి ప్రవేశిస్తున్నట్లు సమాచారం. బ్రాండెడ్ ముసుగులో ఫేక్ సిగరెట్లు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పైన పేర్కొన్న రాష్ట్రాల్లో అచ్చం బ్రాండెడ్ సిగరెట్లకు ఏమాత్రం తీసిపోని విధంగా నకిలీ సిగరెట్లు చుట్టేస్తున్నారు. తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో వినియోగదారులు కూడా అధిక మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. ఒక్క ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏడాదికి ఏకంగారూ.100.కోట్ల విలువైన నకిలీ సిగరెట్ల వ్యాపారం సాగుతున్నట్లు సమాచారం..

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

- అసలుని పోలినట్లే నకిలీ సిగరెట్ల ప్యాకింగ్
- గుంటూరు జిల్లాలో జోరుగా నకిలీ సిగరెట్ల వ్యాపారం
- ఇటీవల ఒక వ్యాపారి వద్ద రూ.1.50 కోట్ల విలువచేసే నకిలీ సిగరెట్లు పట్టివేత
- కొరియర్, పార్సిల్స్, భారీ లారీల్లో సిగరెట్ల రవాణా
- లోపించిన పోలీసుల నిఘా

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా నకిలీ సిగరెట్లు హల్‌చల్ చేస్తున్నాయి. కొందరు వ్యాపారులు నకిలీ సిగరెట్లను జిల్లాకు తెచ్చి జోరుగా వ్యాపారం చేస్తున్నారు.కోల్‌కతా లైన్ కేంద్రంగా ఢిల్లీ, బిహార్, రాయ్‌పూర్ నుంచి ఖరీదైన సిగరెట్ స్థానంలో నకిలీ రంగ ప్రవేశం చేస్తోంది. ఇటీవల విశాఖ రైల్వే స్టేషన్‌లో బండిల్స్ కొద్దీ దొరికిన ఫేక్ సిగరెట్ బండిల్స్ ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇక్కడి నుంచి నకిలీ సిగరెట్లు గుంటూరు కూడా తరలివస్తున్నట్లు సమాచారం. బ్రాండెడ్‌కు దగ్గరగా ఉంటూ ధూమపాన ప్రియులను తక్కువ ధరలతో ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఇండియన్ టొబాకో కంపెనీ(ఐటీసీ) ద్వారా మాత్రమే నాణ్యమైన పొగాకుని కొనుగోలు చేసి బ్రాండెడ్ కంపెనీలు సిగరెట్స్‌ని తయారు చేస్తుంటాయి. గతంలో ఐటీసీ గుర్తింపు పొందిన కంపెనీల సిగరెట్స్ మాత్రమే మార్కెట్లో దర్శనమిచ్చేవి. కేంద్రం విధించిన పన్ను భారంతో బ్రాండెడ్ సిగరెట్స్ ఖరీదైపోవడంతో నకిలీ సిగరెట్లు ఇప్పుడు హల్‌చల్ చేస్తున్నాయి. ఒకప్పుడు గుంటూరు కే పరిమితమైన ఈ నకిలీ సిగరెట్ల వ్యాపారం నేడు జిల్లాలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో కూడా వ్యాపించి ప్రజా ఆరోగ్యానికి పెద్ద ఎత్తున గండీ కొడుతున్నాయి.

**నకిలీ సిగరెట్ తయారీ ఇలా?**

బ్రాండెడ్ కంపెనీలు వాడే పొగాకులో నాసిరకం పొగాకుని అతి తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేసుకుంటారు. పొగాకుతో పాటు రంపపు పొట్టుని కూడా కలిపేసి చవగ్గా సిగరెట్స్ తయారు చేసేసి.. వాటిని మార్కెట్‌లోని బ్రాండెడ్ సిగరెట్స్ ప్యాకెట్స్

మిగతా 3వ పేజీలో










# కరెంట్ బిల్లు రాదంతే..!



- 25 ఏళ్ల పాటు వెసులుబాటు
- ఇంటి విద్యుత్ బిల్లులో ఆదా
- వినియోగదారులకు ప్రయోజనం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

ఇంటి బడ్జెట్‌లో విద్యుత్తు బిల్లు పద్దు నెలనెలా పెరుగుతోంది. డిస్కంలు వేసే అదనపు భారాలతో కలిపి మధ్యతరగతి కుటుంబానికి వచ్చే బిల్లు ప్రతి నెలా రూ.వెయ్యికి తగ్గడం లేదు. దీంతో విద్యుత్ వినియోగించే ప్రతి సామాన్యుడికి, విద్యుత్ ఆదాతో పాటు కుటుంబ ఖర్చుల్లో అంత మిగులుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు. అదనంగా వాడినా.. నెట్ మీటరింగ్‌తో బిల్లు తక్కువే వస్తుంది. ఎందుకు భాను కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని అమలు చేస్తోంది. 'పీఎం సూర్యఘర్'అనే పథకాన్ని ప్రారంభించింది. దీనివల్ల సామాన్య, మధ్యతరగతి, ఇతర పేద కుటుంబాల వారికి ఎన్నో ప్రయోజనం దక్కుతాయి. ఈ విధానం ప్రకారం ఈ సిస్టంను ఫాలో అయిన వారికి 25 సంవత్సరాల పాటు కరెంటు బిల్లు వచ్చే అవకాశం ఉండదని చెబుతున్నారు. ఈ పథకం వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుతుంది. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటికే పొన్నూరు నియోజకవర్గంలోని చేబ్రోలు లో కొంతమంది ఈ పథకాన్ని వినియోగించుకుని తమ ఇళ్లపై

మిగతా 3వ పేజీలో

# డబ్బులు కొట్టేశారు.. ప్రశ్నిస్తే కేసులు పెట్టారు

## ఎస్పీ గ్రీవెన్స్‌లో యర్రపాలెం మహిళలు ఫిర్యాదు

**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్**

రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద మహిళలు వారు. కుటుంబ అవసరాల కోసం రూపాయి.. రూపాయి కూడా పెట్టి డ్వాక్రాలో దాచిపెట్టుకున్నారు. గ్రూపులోని కొందరు సభ్యులు కంచె చేను మేసినట్లుగా ..కొందరు సభ్యులకు తెలియకుండా పొదుపు సొమ్ము నొక్కేశారు. ఈ విషయంపై గ్రూపు సభ్యులు సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. జరిగిన అన్యాయంపై ఇది ఏమిటి...? అని ప్రశ్నిస్తే... వారి పైనే పోలీస్ కేసులు పెట్టించారు. మంగళగిరి రూరల్ పోలీసులు కూడా వారికే వత్తాసు పలకటం బాధ కలిగిస్తుందని మంగళగిరి మండలం ఎర్రపాలెం మహిళలు కన్నీటి పర్యంతమైనారు. గ్రామానికి చెందిన పదిమంది మహిళలు ఒక గ్రూపు గా ఏర్పడ్డారు. గ్రూపు లీడర్లుగా భవాని, నాగ పూర్ణ లక్ష్మి నీ ఎంచుకున్నారు. ఆర్ పి శిరీష ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులు



మిగతా 3వ పేజీలో

# మూగ, చెవిటి విద్యార్థులకు ల్యాప్ ట్యాప్‌లు అందజేత

**గుంటూరు, మేజర్ న్యూస్ :** సోమవారం ఉదయం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో 2024-25 విద్యా సంవత్సరములో డిగ్రీ చదివే ఆరు మంది మూగ, చెవిటి విద్యార్థులకు ల్యాప్ టాప్ లను జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ వికలాంగుల సంక్షేమ శాఖ ఏ డి సువార్త , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, ఆర్డిఓ శ్రీనివాస రావు అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరములో డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు చదివే దివ్యాంగులు www.apdascac.ap.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత మేరకు ఏ.పి.డీఫ రెన్షియల్ అండ్ సీనియర్ సిటిజన్ అసిస్టెన్స్ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా ల్యాప్ టాప్‌లు అందించడం జరుగుతుందని తెలిపారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి సువార్త ఏ.పి.డీఫ రెన్షియల్ అండ్ సీనియర్ సిటిజన్ అసిస్టెన్స్ కార్పొరేషన్‌కు సంయుక్త కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా, డీఆర్డీఏ, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు శంకర్, విజయలక్ష్మీ, ప్రసాద్,



జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, డిపిఓ బి.వి.నాగ సాయి కుమార్, జిల్లా ఉద్యాన అధికారి రవీంద్ర, ఎస్.ఈ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య, డిఎస్ డబ్ల్యూ ఎస్ మోహన్, డియం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ, సిపిఓ శేషశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దివ్య ప్రతిష్టా మహోత్సవం

**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి కొలనుకొండలో వేంచేసియున్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వారి దివ్య ప్రతిష్టాపనా మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహం, అగ్నిధ్యానం,ఉక్త హోమం, ప్రధాన హోమాలు, రత్నన్యాస, ధాతున్యాస, యంత్ర న్యాస పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8:04 నిమిషాలకు ఏకకాలంలో విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, మాలికాపు రత్తమ్మ, ఆంజనేయ ధ్వజస్తంభ సహిత శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వార్ల విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో మహా పూర్ణాహుతి, కళా ఆ వాసన, ప్రధమ అర్చనం, కన్య, గో, ప్రధమ దర్శనం, ఆచార్య సన్మానం, మహాదాశీర్వచనం, నీరాజన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్





కార్పొరేషన్ ఛైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదన్ రావు, నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు తిరుమలశెట్టి కొండలరావు, జనసేన పార్టీ ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీ రావు, తాడేపల్లి మండల అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, కొలనుకొండ గ్రామ అధ్యక్షులు లింగా శ్రీకాంత్, మంగళగిరి శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు తిరుమలశెట్టి మురళీకృష్ణ, మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ యువజన నాయకులు చిట్టెం అవినాష్, ఎంటీఎంసీ కార్యదర్శులు బళ్ల ఉమామహేశ్వరావు, దాసరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మహిళా నేత బడే కోమలి తదితరులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# పొగరాయుళ్లకు నకిలీ సిగరెట్ల సెగ..!

(మొదటి పేజీ తరువాయి)

మాదిరిగా సిద్ధం చేసేస్తున్నారు. ఆ ప్యాకెట్స్‌పై ఎక్కడ తయారవుతున్నాయి.? వాటి కంపెనీ ఏమిటి.? అనే వివరాలు మాత్రం కనిపించవు. కొందరు తెలివిగా.. బ్రాండెడ్ ప్యాకెట్స్‌పై ఉన్న టోల్‌ఫ్రీ నంబర్లనే ముద్రించి విక్రయిస్తున్నారు.

**ఎలా వచ్చేస్తున్నాయ్..?**

గతంలో బంగ్లాదేశ్, నేపాల్ నుంచి నకిలీ సిగరెట్లు వచ్చేవి. ఇప్పుడు దేశంలోని వివిధ ప్రాంతాల్లో వీటిని తయారు చేసేస్తున్నారు. ఢిల్లీ, బిహార్, సూరత్, రాయ్‌పూర్, చండీగఢ్, కోల్‌కతా వంటి నగరాల్లో అసలు బ్రాండ్లను పోలిన సిగరెట్లు తయారవుతున్నాయి. వీటిని కోల్‌కతా కేంద్రంగా వివిధ మార్గాల్లో రవాణా చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోకి మాత్రం రైలు మార్గంలోనే ఎక్కువగా రవాణా చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల విశాఖ డివిజన్ రాష్ట్ర పన్నుల శాఖ అధికారులు రూ. లక్షల విలువ చేసే నకిలీ సిగరెట్లను పట్టుకున్నారు. వాటిని ఎవరు ఆర్డర్ చేశారన్నది మాత్రం ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మిగిలింది. ఎవరి ద్వారా ఈ సిగరెట్లు పొరుగు రాష్ట్రాల సరిహద్దులు దాటి కోస్తాలోని అన్ని జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయో తెలిసి కూడా పోలీసులు బయటపెట్టడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.

**నకిలీ పొగ.. ప్రాణాంతకం**

సాధారణంగా బ్రాండెడ్ సిగరెట్లు తాగితేనే క్యాన్సర్, గుండెజబ్బులు, నరాల బలహీనతలు, ఊపిరితిత్తుల వ్యాధులు సంక్రమిస్తుంటాయి. అలాంటిది నకిలీ సిగరెట్లు తాగడం వల్ల.. ఈ వ్యాధులు వేగంగా శరీరాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సిగరెట్స్ తయారైన ఆరు నెలల్లోపే వినియోగించాలి. ఆ తర్వాత అందులో ఫంగస్ చేరి.. మనిషి ఆయువుని తీసేస్తుందని.. సిగరెట్లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. కొంతమంది కొరియర్లు, భారీ వాహనాల్లో నకిలీ సిగరెట్లను రవాణా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కొరియర్ సంస్థలు పార్శిల్ పంపే వారి వివరాలు, అందులో ఏ వస్తువు ఉందో తెలుసుకోవాలి. అయితే కొన్ని కొరియర్ సంస్థలు నిబంధనలను గాలికి వదిలేయడంతో ఫేక్ సిగరెట్లు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రవేశిస్తున్నాయి. ఇక్కడినుంచి కొంతమంది వ్యాపారులు వేరే జిల్లాలకు ఈ సిగరెట్లు తరలించి వ్యాపారం చేసుకుంటున్నారు . తెల్లవారుజామున శివారు ప్రాంతాల్లోకి సరుకును తీసుకొస్తారు. అక్కడ నుంచి రిటైలర్లు, డీలర్లు ఆటోల్లో దుకాణాలకు తరలించుకుంటారు. పట్టుబడితే కీలక నిందితుల పేరు బయటకు పొక్కకుండా మిన్నకుండటంతో సూత్రధారులను పట్టుకోవడం కష్టతరంగా మారింది. ఇటీవల గుంటూరులో ఒక లారీ సిగరెట్ సరుకుని విజిలెన్స్ అధికారులు చాకచక్యంగా పట్టుకుని గోడౌన్ యజమాని, సిగరెట్ల లారీ తెప్పించిన వారిని పట్టుకున్నారు. వారిని పూర్తిగా విచారిస్తే ఈ నకిలీ సిగరెట్లు ను గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్న ఘనులు మరికొంతమంది బయటపడే అవకాశం ఉంది. పోలీసులు ఈ ఒక్క ఆధారంతో లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉంది. కీలక నిందితులను పట్టుకోకపోవడం వల్లే ఈ దందా దర్జాగా సాగిపోతున్నట్లు తెలుస్తోంది. గతంలో విజయవాడ శివార్లలోని అజిత్‌సింగ్ నగర్, అంబాపురం, ముస్తాబాద, గన్నవరంలో కొరియర్ సంస్థలకు సంబంధించిన గోడౌన్లలో జీఎస్టీ అధికారులు తనిఖీ చేశారు. కోట్ల రూపాయల విలువైన నకిలీ సిగరెట్లు, ఖైనీ ప్యాకెట్లను సీజ్ చేశారు. భారీ ఎత్తున నకిలీ సిగరెట్ల వ్యాపారం జరుగుతోందంటే ఇందులో చాలా మందికి ఇందులో చాలామంది వాటాలు ఉన్నారనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. ఎంతో మంది కలిసి ఈ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. ఎక్కడో చిన్న ముఠాని పట్టుకుని ప్రచారం చేసుకుంటున్నాము. కానీ దీనికి చెయ్యాల్సింది చాలా ఉంది. చెక్?పోస్టుల దగ్గర వాహనాల్లో లోడ్ ఏది వెళ్తుందో అనేది తెలుసుకునే విధంగా నూతన టెక్నాలజీని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. సిగరెట్ల అక్రమ రవాణాను నిలువరించేందుకు పోలీసులు, జీఎస్టీ అధికారులు జి అప్పుడప్పుడు ప్రయత్నిస్తున్నా ఎలాంటి ఉపయోగం లేదు. సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు సరుకు పట్టుకున్నప్పుడు చేసే హడావుడి కేసు దర్యాప్తులో చూపించటం లేదు. డ్రైవర్లను, కమీషన్ ఏజెంట్లను మాత్రమే అరెస్ట్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అసలు మాఫియా వెనకున్న కీలక నిందితులను పట్టుకోకపోవడం వల్లే దర్జాగా దందా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. నకిలీ సిగరెట్ల వ్యాపారాన్ని నిర్వహిస్తున్న వ్యక్తులతో పాటు. కోట్లాది రూపాయల విలువచేసే వాటిని తయారు చేస్తున్న కంపెనీలపై గట్టిగా మెగా పెట్టి పట్టుకోవాల్సిన బాధ్యత పోలీసులు, ఇన్కమ్ టాక్స్, జీఎస్టీ, విజిలెన్స్ అధికారులపై ఎంతో ఉంది.

# కరెంట్ బిల్లు రాదంతే..!

(మొదటి పేజీ తరువాయి)




సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇంటి బడ్జెట్‌లో విద్యుత్తు బిల్లు పద్దు నెలనెలా పెరుగుతోంది. డిస్కంలు వేసే అదనపు భారాలతో కలిపి మధ్యతరగతి కుటుంబానికి వచ్చే బిల్లు ప్రతి నెలా రూ.వెయ్యికి తగ్గడం లేదు. అలాంటిది ఏడాదో, రెండేళ్లో కాదు.. ఏకంగా 25ఏళ్ల పాటు పైసా విద్యుత్తు బిల్లు చెల్లించాల్సిన పని లేకుంటే ఎంత వెసులుబాటు కలుగుతుంది? పీఎం సూర్యఘర్ ముఫ్తి బిజిలీ యోజన దీన్ని సాకారం చేస్తోంది. ఈ పథకం కింద ఇళ్ల కప్పుపై సౌర విద్యుత్తు ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునేవారికి ఈ వెసులుబాటు దొరకనుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 50 నేలకు పైగా వినియోగదారులకు పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలనూ ఇస్తున్నాయి. ఇళ్లపై ఏర్పాటు చేసుకున్న ప్రాజెక్టుల ద్వారా వచ్చే విద్యుత్తుకు మించి వాడినా నెట్ మీటరింగ్ విధానంలో బిల్లు లెక్కిస్తారు. ఫలితంగా పెద్దగా భారం పడదని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి వర్గాల వినియోగదారుల నెల విద్యుత్తు వినియోగం 225 యూనిట్లలోపే ఉంటుంది. డిస్కంలు నెలనెలా గృహ విద్యుత్తు వినియోగదారులకు ఇచ్చే బిల్లుల్లో 95 శాతం నాలుగు శ్లాబ్‌లలోనే (0-30, 31-75, 76-125, 126-225) ఉన్నాయి. ఆయా వర్గాలవారు ఇళ్లపై రెండు కిలోవాట్ల సౌర ప్రాజెక్టు ఏర్పాటు చేసుకున్నట్లయితే ఛార్జీల భారాన్ని వినియోగదారులు భారీగా తగ్గించుకోవచ్చు. రెండు కిలోవాట్ల సౌరప్రాజెక్టు ద్వారా నెలకు 200 నుంచి 240 యూనిట్ల విద్యుదుత్పత్తి అవుతుందని అంచనా. ప్యానల్ జీవితకాలం 25 ఏళ్లు. వినియోగం దానికి లోపునే ఉంటే ఛార్జీలను చెల్లించాల్సిన అవసరమే లేదు. మిగులు ఉన్నట్లయితే యూనిట్ విద్యుత్తును రూ.2.09 చొప్పున డిస్కంలే కొంటాయి. విద్యుదుత్పత్తికి మించి వినియోగిస్తే అదనపు మొత్తానికి టారిఫ్ ప్రకారం డిస్కం బిల్లు వసూలు చేస్తుంది. పీఎం సూర్యఘర్ కింద 2027 మార్చినాటికి 20 లక్షల ఇళ్లపై ఒక్కోచోట రెండు కిలోవాట్ల సామర్థ్యమున్న ప్రాజెక్టుల ఏర్పాటు ప్రభుత్వ లక్ష్యం. వాటి ద్వారా సుమారు 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి చేస్తారు. రెండు కిలోవాట్ల ప్రాజెక్టుకు (రూ.1.10 లక్షలు వ్యయమవుతుందని అంచనా) కేంద్రం ఇచ్చే రాయితీ రూ.60 వేలు కాగా.. బీసీలకు అదనంగా మరో రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం రాయితీనిస్తుంది. అంటే బీసీ వాడకందారులకు ప్రూ.30 వేలతోనే ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుంది. ఆ మొత్తాన్నీ బ్యాంకు రుణంగా పొందవచ్చు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోకొన్ని గ్రామాల్లో తమ నివాసంపై సోలార్ ప్యానెళ్లను పలువురు అమర్చుకున్నట్లు తెలిసింది. ఉదాహరణకు ఒక విద్యుత్తు వినియోగదారుడు రెండు కిలోవాట్ల సౌర ప్రాజెక్టు ఏర్పాటుచేసుకుంటే.. ఆ నెలలో దాని నుంచి 200 యూనిట్ల విద్యుత్తు మాత్రమే వచ్చిందనుకుందాం. ఆ నెలలో 250 యూనిట్లు వాడినట్లయితే ఉత్పత్తి చేసిన విద్యుత్తుకంటే అదనంగా 50 యూనిట్లు వినియోగించి నట్లవుతుంది. ఆ విద్యుత్తుకు డిస్కంల టారిఫ్ ప్రకారం రూ.117 (మొదటి 30 యూనిట్లకు.. ఒక్కొక్క యూనిట్‌కు రూ.1.90 చొప్పున రూ.57, మిగిలిన 20 యూనిట్లకు (31-75 శ్లాబ్) రూ.60) చెల్లిస్తే సరిపోతుంది. జిల్లాలో డిస్కంల పరిధిలో గృహ, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక విద్యుత్తు కనెక్షన్లు కలిపి సుమారు 3.02 కోట్లున్నాయి. వాటిలో గృహ కనెక్షన్లు 3 కోట్లు. అందరికీ ఇళ్లపై సౌర విద్యుత్తు ప్రాజెక్టులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటుంది.

**కేంద్రం ఇస్తున్న రాయితీ**

ఇళ్లపై రెండు కిలోవాట్ల ప్రాజెక్టుకు రూ.60 వేలు, మూడు కిలోవాట్ల ప్రాజెక్టుకు రూ.78 వేలు, గ్రూప్ హౌసింగ్ సొసైటీలు/రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, కామన్ అవసరాలు, ఈవీ ఛార్జింగ్ కేంద్రం కోసం 500 కిలోవాట్ల (ప్రతి ఇంటికి మూడు కిలోవాట్ల చొప్పున) వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. కిలోవాట్‌కు రూ.18వేల చొప్పున రాయితీ అందుతుంది.

## డబ్బులు కొట్టేశారు... ప్రశ్నిస్తే కేసులు పెట్టారు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ కెనరా బ్యాంకులో అకౌంట్లు ఓపెన్ చేసి డబ్బులు తీసుకున్నారు. అనంతరం ప్రతినెల కొంత మొత్తం పొదుపు ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నారు. ఇటీవల పొదుపు ఖాతాలో సుమారు రెండు లక్షల వరకు మాయమయ్యాయి. ఇదేమిటి అని లీడర్లు ను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో మా గ్రూపులోని ఒక సభ్యురాలు షర్మిల దేవి చేత మాపై మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించారు. మొత్తం 8 మందిపై పోలీసులు అన్యాయంగా కేసు నమోదు చేశారు. మా డబ్బులు కాజేసి మాపైనే కేసులు పెట్టడం ఏమిటని బాధిత మహిళలు కన్నీటిపర్యంతమైనారు. ఈ విషయంపై తాము సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని విలేకరులకు తెలిపారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై నిష్పక్షపాతంగా విచారణ చేసి. మాపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని బాదిత మహిళలు వి. లక్ష్మి, వి. సాయి దుర్గ, షేక్ ముంతాజ్, మహాలక్ష్మి తదితరులు అధికారులను వేడుకున్నారు. ఖాతాలో నుంచి కాజేసిన డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు.

## బంగారు బట్టీ నిర్వాహకుడి ఆత్మహత్యలో పోలీసుల ప్రమేయం లేదు- డీఎస్పీ జనార్దన రావు



**తెనాలి, మేజర్ న్యూస్ :** బంగారు బట్టి నిర్వాహకుడు సిద్దేశ్ ఆత్మహత్యలో పోలీసుల ప్రమేయం లేదని తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు తెలిపారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జనార్దన్ మాట్లాడుతూ పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎం ఎం జ్యువెలర్స్ అధినేత రమేష్ తన వద్ద మేనేజర్ గా పనిచేస్తున్న అనిల్ కుమార్ జైన్ తనను మోసగించి కేజీ పైగా బంగారం దొంగలించారని పిర్యాదు చేసినట్లు చెప్పారు. విచారణలో అనిల్ కుమార్ జైన్ నేరం అంగీకరించి తన వద్ద కొంత బంగారం ఉందని మిగిలినది కొంత మంది వ్యక్తులకు అమ్మినట్లు చెప్పారని తెలిపారు. అనిల్ కుమార్ జైన్ వద్ద నున్న బంగారం రికవరీ చేశామన్నారు. మిగిలిన బంగారం నిమిత్తం త్రీ టౌన్ ఎస్ ఐ ప్రకాశరావును విచారణ నిమిత్తం బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. విచారణలో విచారణలో బంగారం బట్టి వ్యాపారి సిద్దేశ్ ను పిలిపించామని చెప్పారు. బంగారం వ్యాపారుల అసోసియేషన్ పెద్దలతో సిద్దేశ్, అనిల్ కుమార్ జైన్ లు కలసి విచారణకు వచ్చారని చెప్పారు. అనిల్ కుమార్ జైన్ తనకు 100 గ్రాముల బంగారం అమ్మినట్లు సిద్దేశ్ స్పష్టం చేసినట్లు చెప్పారు. దేనిపై మరుసటి రోజు మాట్లాడుకుందామని పెద్దల సమక్షంలో వారి బంధువులు అంగీకరించి వెళ్లిపోయారని తెలిపారు. తరువాతి రోజు సిద్దేశ్ తన ఇంటిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. దీనిపై పోలీసులకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పిర్యాదు మేరకు కేసులో కొందరు వ్యక్తులను విచారించామని తెలిపారు. విచారణలో తాము అనిల్ కుమార్ జైన్ వద్ద నుండి బంగారం కొనుగోలు చేసినట్లు అంగీకరించినట్లు చెప్పారు. పోలీసులపై వస్తున్న తప్పుడు కథనాలను నిరాధారమైన అని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో వన్ టౌన్ సీఐ మల్లికార్జున రావు, ఎస్ ఐ ఆనంద్ పాల్గొన్నారు.

## చేబ్రోలు ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన ఊహారాణి



**చేబ్రోలు, మేజర్ న్యూస్ :** చేబ్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా టి.ఊహారాణి సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. భట్టిప్రోలు మండలం డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఈమెకు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పదోన్నతి రావడం జరిగింది. డిప్యూటీ ఎంపీడీవో నుండి పదోన్నతి పొందిన ఈమె ఎంపీడీవో హెూదా లో చేబ్రోలు మండల ప్రజా పరిషత్ కు భట్టిప్రోలు మండలం నుండి బదిలీపై రావడం జరిగింది. తొలిసారి ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన ఊహారాణి కి పంచాయతీ కార్యదర్శుల సంఘం తరపున మండలములోని అందరు పంచాయతీ కార్యదర్శులు,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఎంజీఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## శివాలయానికి భారీ గేట్లు బహూకరణ



**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెద్దకాకాని శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానమునకు క్యూ లైన్లుగా వినియోగించుటకు పల్నాడు జిల్లా, శావల్యాపురం మండలం, ఈర్లపాడు గ్రామ వాస్తవ్యులు ఆరుమళ్ళ వెంకటరావు ధర్మవతి అనూష వారి కుటుంబ సభ్యులతో కలిసి జింకు పైపులతో చేసిన రూ. లక్ష విలువ చేయు 25 బారిగేట్లు శివాలయానికి చేసినట్లు ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళము సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని భక్తులకు విజ్ఞప్తి చేసినారు. అనంతరం దాతలకు ప్రత్యేక దర్శనం,వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వట్టిచెరుకూరు - గుంటూరు రూట్‌లో బస్సులు పెంచండి

**గుంటూరు, మేజర్ న్యూస్ :** వట్టిచెరుకూరు నుండి లేమేల్లపాడు, అనంతవర ప్పాడుల మీదుగా గుంటూరు నకు ఆర్టీసీ బస్సులు పెంచాలని ప్రజలు కోరుతు న్నారు. గతంలో గుంటూరు-1 డిపో నుండి వట్టిచె రుకూరు వరకు రెండు బస్సులు నడిచేవని ప్రస్తుతం చాలా సంవత్సరాలనుండి వాటిని నడపటం లేదని, పొన్నూరు, బాపట్ల, నుండి బస్సులు వస్తుండటం వలన బస్సులో చివరన సీట్స్ ఖాళీ ఉంటున్నాయని, కొన్నిసార్లు అసలు ఖాళీ లేక నిలబడాల్చి వస్తుందని ఫలితంగా ఆటోలను ఆశ్రఇంచ్చాల్చి వస్తుం దని వాఫోతు నారు. కూటమి అది కారం లోకి వచ్చినా మా గ్రామాలకు ఆర్టిసి బస్సులు తిరగటంలో మార్పు లేదని చాలీ చాలని విధంగానే బస్సులు నడుపుతూ ఆటోలకు అవకాశం కల్పిస్తున్నారని ప్రజలు వాఫోతున్నారు. బాపట్ల డిపో నుండి వట్టి చెరుకూరు మీదుగా గుంటూరు నకు తిరుగు చున్న బస్సు ను అన్ని ట్రిప్పులు తమ రూట్ లోనే నడపాలని, అదే విధంగా గుంటూరు -1 డిపో నుంచి కూడా మరో బస్సు ను, వట్టిచెరుకూరు మీదుగా బాపట్లకి నడపాలని తెలుపు తున్నారు. పొన్నూరు డిపో నుండి వట్టి చెరుకూరు, అనంతవరప్పాడు మీదుగా గుంటూరు నకు రెండు బస్సు సర్వీస్లు తిరుగుతున్నాయని, బాపట్ల నుంచి గుంటూరు నకు కూడా రెండు బస్సు సర్వీస్లు నడపాలని కోరుతున్నారు.

# మంగళగిరిలో త్వరలోనే రెండో దశ ఇళ్ల పట్టాల పంపిణీ

- భవన నిర్మాణ అనుమతులు సీఆర్డీయే నుంచి ఎంటీఎంసీకి బదిలీ
- పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు అవసరమైన చర్యలు చేపట్టండి
- మంగళగిరిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి లోకేష్ సమీక్ష



**తాడేపల్లి, మేజర్ న్యూస్:** మంగళగిరి నియోజకవకర్గంలో త్వరితగతిన రెండో దశ ఇళ్ల పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు చేపట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఏడాది కాలంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలపై ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంగళగిరి నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి మొదటి విడతగా సుమారు 3వేల మందికి శాశ్వత పట్టాలు అందజేయడం జరిగిందని, రెండో విడతలో 2,500 ఇళ్ల పట్టాల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైల్వే, కాలువ, అటవీ, దేవాదాయ భూముల విషయంలో నెలకొన్న సమస్యలను తర్వితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మంగళగిరిలో యూ1, ఐ2 జోన్లు, భవన నిర్మాణ అనుమతులు సీఆర్డీయే నుంచి ఎంటీఎంసీకి బదిలీ చేసే అంశంపైనా సమావేశంలో చర్చించారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, స్టోమ్ వాటర్ డ్రైన్స్, తాగునీరు, అండర్ గ్రౌండ్ గ్యాస్, పవర్ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. ఆగష్టు నాటికి ఆయా ప్రాజెక్టుల డీపీఆర్ లను పూర్తిచేసి అన్ని పనులు ఒకేసారి ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిధుల సమీకరణపై అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలపై చర్చించారు. డిజైన్స్ ను పకడ్బందీగా తయారుచేయాలని మంత్రి ఆదేశించారు. మంగళగిరి నియోజకవర్గంలో పీఎం సూర్య ఘర్ పథకం అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద 37వేల దరఖాస్తులు వచ్చాయని అధికారులు వివరించారు. లబ్ధిదారులకు అవసరమైన రుణ సదుపాయం కోసం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. నిత్యం రద్దీగా ఉండే మంగళగిరి-తెనాలి-నారాకోడూరు మధ్య రోడ్డు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. జులై 15 నాటికి డీపీఆర్ సిద్ధం అవుతుందని, ఈ ఏడాది నవంబర్ లో పనులు ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి అధికారులు రూపొందించిన వివిధ ప్రణాళికలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. గుంటూరు-బాపట్ల రహదారి నిర్మాణంపైనా సమావేశంలో చర్చించడం జరిగింది. చినకాకాని ఐటీ పార్క్, మోడల్ స్కూల్ గా నిడమర్రు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, మంగళగిరిలో వీవర్స్ శాల, పార్క్ ల అభివృద్ధి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశాలతో పాటు పెనుమాక, మంగళగిరి, దుగ్గిరాలలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నిర్మాణం, నియోజకవర్గ వ్యాప్తంగా కమ్యూనిటీ భవనాలు, అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణంపైనా సమావేశంలో చర్చించారు. అంగన్ వాడీ కేంద్రాల నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, గుంటూరు ఇంఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ శ్రీమతి సంజనా సిన్హా, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఏడీసీఎల్ సీఈ ప్రభాకర్, మంగళగిరి సీపీడీసీఎల్ ఏడీఈఈ సురేష్ బాబు, ఆర్ అండ్ బీ సీఈ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ సీఈ ఎమ్.రాజేంద్ర ప్రసాద్, అధికారులు జేవీఆర్ రెడ్డి, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అపరిష్కృత సమస్యలపై యాక్షన్ ప్లాన్ : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గుంటూరు నగరంలో ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న అపరిష్కృత సమస్యలపై వెంటనే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశించారు. మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం ఇంజినీరింగ్ ఈఈ, డీఈఈ, ఏఈలతో ఎమ్మెల్యే నసీర్ చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఎన్నో ఏళ్లుగా కొన్ని పనులు ముందుకు కదలడం లేదని, వాటిపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని సూచించారు. నగరంలో ఐలాండ్ ను సుందరీకరణ చేపట్టి, గ్రీనరీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇది నగరానికే బ్యూటిఫికేషన్ తెచ్చేలా ఉండాలన్నారు. పార్కుల్లో పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు, చుట్టూ ప్రహరీ, గ్రీనరీపై దృష్టి సారించా లని సూచించారు. పెండింగ్ లో ఉన్న యూపీహెచ్ సీ



ఏర్పాటుకు స్థల సేకరణ చేపట్టాలన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో యోగా, జిమ్ కేంద్రాలకు సెంటర్లను గుర్తించాలని సూచించారు. దీంతోపాటు సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. గుంటూరు నగరంలో అన్ని ప్రాంతాల్లో గ్రీనరీ ఉండాలని, ప్రజలకు ఆరోగ్యంతోపాటు ఆహ్లాదాన్ని అందిం చాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం పది నెలల కాలంలోనే యుద్ధప్రాతిపదిక సీసీ డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు సైతం నాణ్యతగా, వేగవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మంచినీటి సరఫరా వ్యవస్థలో లోపాలను గుర్తించి సరి చేయాలన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణం ప్రారంభమైన నేపథ్యంలో సమగ్ర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. గత ప్రభుత్వంలో నగరంలో అభివృద్ధి ఆనవాళ్లు లేకుండా చేశారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి కాలనీలోనూ గుంతల రోడ్లు, మురుగుల కాలువలు, సౌకర్యాలలేమి కనిపించాయని తెలిపారు. గుంటూరు నగరాభి వృద్ధికి నూతన ప్రతిపాదనలతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని అభివృద్ధి పనులను సమాన స్థాయిలో చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# సంఘ విద్రోహ శక్తులకు అధ్యక్షుడు జగన్‌రెడ్డి : మన్నవ మోహన కృష్ణ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రౌడీ షీటర్లు, గంజాయి మాఫియా, హత్య కేసు నిందితులకు మద్దతుగా... ఒక పోలీస్ కానిస్టేబుల్‌పై హత్యాయత్నం చేసిన క్రిమినల్స్‌ను పరామర్శించడానికి మంగళవారం తెనాలిలో వెళు న్న జగన్... నువ్వు ప్రతిపక్ష పార్టీకి అధ్యక్షుడివా? ఈ సంఘ విద్రోహులకు అధ్యక్షుడివా? అంటే ఎస్... నేను సంఘ విద్రోహులకే బాస్‌ని అని తనకు తానుగా ప్రకటించినట్లుగా ఉందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి గ్యాంగ్, బ్లేడ్ బ్యాచ్, ఆడబిడ్డలను వేధించే వారికే జగన్ వత్తాసు పలకడం చూస్తుంటే ఆయనలో ఎంతటి సైకో దాగి ఉన్నాడో అర్థం చేసుకోవచ్చునన్నారు. "ఇటీవల తెనాలిలో కానిస్టేబుల్ చిరంజీవిపై దాడి చేసిన గంజాయి గ్యాంగ్ ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చేందుకు తెనాలి టూ టౌన్ సీఐ నడిరోడ్డుపై గంజాయి గ్యాంగ్‌కు బుద్ధి చెప్పిన వైనాన్ని రాష్ట్ర ప్రజలంతా స్వాగతిస్తుంటే... సైకో జగన్ మాత్రం గంజాయి బ్యాచ్‌ను సమర్థిస్తూ పరామర్శకు బయలుదేరడం నీచమైన చర్య. జగన్ పరామర్శిం చనున్న చెబ్రోలు జాన్ విక్టర్ అనే వ్యక్తిపై ఇప్పటికే పలు కేసులతో పాటు రౌడీషీట్ ఉంది. అలాంటి వ్యక్తులను పరామర్శించనున్న జగన్... నీతి, న్యాయం, నైతిక విలువలు గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. రౌడీలు, గూండాలు, దోపిడీదారులను వెంటేసుకుని తిరిగే జగన్‌ను చూసి పిల్ల సైకోలు మరింత రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నారు. మొన్నటికి మొన్న మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నంలో చిన్నపిల్లోడి సైకిల్ తీసుకుని భీభత్సం సృష్టించారు. ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నాయకుల తీరులో ఏమాత్రం మార్పురాలేదు. అమ్మ ఒడికి రూ.13,000 ఇచ్చి నాన్న బుడ్డీలోనుంచి రూ.లక్ష కొట్టేశారు. డ్రైవర్ కు రూ.10,000 ఇచ్చి.. డీజిల్, పెట్రోల్ జరిమానాలు పెంచి.. లక్ష కొట్టేశారు.



మత్స్యకా రులకు రూ.10,000 ఇచ్చి జీవో 217 ద్వారా చెరువులు, రిజర్వాయర్లలో చేపలు పట్టుకునే హక్కు రద్దు చేశారు. ఇలా పది ఇచ్చి పేదల వద్ద వంద గుంజుకున్నారు. సుమారు పది లక్షల ఎకరాల అసైన్మెంట్ భూముల్ని జగన్ ముఠా కబ్జాలు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్ ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి.. పేదల వెన్ను విరిచారు. ఈ మోసాలను ప్రశ్నించిన బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీల్ని 600 మందిని హత్యలు చేయించారు. వేలాది మందిపై అక్రమ కేసులు పెట్టి జైళ్ళకు పంపారు. మాటల్లో పేదల పట్ల కపట ప్రేమ ఒలకబోస్తూ ఆచరణలో పేదలను జగన్ నిరుపేదలుగా దిగజార్చారు. వైసీపీ మేనిఫెస్టో హామీల్లో 85% ఎగనామం పెట్టారు. ఇలా పేదలకు వెన్నుపోటు పొడిచిన మోసకారి జగన్." అని మోహనకృష్ణ నిప్పులు చెరిగారు.

# ప్రజాసేవే లక్ష్యంగా గివింగ్ బ్యాక్ టు సొసైటీ సేవలు

**పదో తరగతి పరీక్షల్లో మంగళగిరి టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం**

**రూ. 10 వేల నగదు బహుమతి అందజేసిన గివింగ్ బ్యాక్ టు సొసైటీ**

**నగర కమిషనర్ చేతుల మీదుగా విద్యార్థినికి చెక్కు ప్రదానం**




**మంగళగిరి, మేజర్ న్యూస్ :**

పదోతరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో మంగళగిరి పట్టణంలో టాపర్‌గా నిలిచిన దంతగాని హర్షితకు గివింగ్ బ్యాక్ టూ సొసైటీ అండగా నిలిచింది. సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన గివింగ్ బ్యాక్ టూ సొసైటీ.. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందిస్తూ ప్రోత్సాహకంగా రూ.10 వేలు నగదు బహుమతిని అందజేసింది. సోమవారం ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా చేతుల మీదుగా సదరు చెక్కును విద్యార్థినికి అంద




జేశారు. మంగళగిరి పట్టణంలోని విజేత స్కూలుకు చెందిన హర్షిత 10వ తరగతి పరీక్షల్లో 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించి మంగళగిరిలో ప్రథమంగా నిలిచింది. ఈ సందర్భంగా కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ.. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గివింగ్ బ్యాక్ టు సొసైటీ నగదు ప్రోత్సాహకాలు అందించడం హర్షించదగ్గ విషయమన్నారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సేవే లక్ష్యంగా గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రతినిధులు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ నగదు ప్రోత్సాహకాలు అందించడం పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులకు సహాయం చేస్తున్న గివింగ్ బ్యాక్ టు సొసైటీ సంస్థను ఆదర్శంగా తీసుకొని ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు రావాలని సూచించారు.

# పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలు

**- కౌన్సిలింగ్ లో జడ్పీ చైర్మన్ క్రిస్టినా వెల్లడి**

**గుంటూరు జిల్లా పరిషత్ మేజర్ న్యూస్:**

సాధారణ బదిలీలలో భాగంగా సోమవారం గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బదిలీల ప్రక్రియలో భాగంగా ఉద్యోగులకు కౌన్సిలింగ్ జరిగింది .ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెరహెని క్రిస్టినా పాల్గొని మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే బదిలీలను నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. జిల్లా పరిషత్తు సీఈవో జ్యోతిబసు మాట్లాడుతూ ఒక ఊరిలో ఐదు సంవత్సరాలు విధులు నిర్వహిస్తే అటువంటి వారికి తప్పనిసరిగా బదిలీలు ఉంటాయి అన్నారు. అదేవిధంగా ఎక్కడైనా ఖాళీలు ఉంటే ఆ ప్రాంతానికి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.బదిలీల్లో భాగంగా జిల్లా పరిషత్ పరిధిలో 91 మందికి స్థానచలనం కలిగింది.వీరిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్




7, సీనియర్ అసిస్టెంట్లు 8, జూనియర్ అసిస్టెంట్లు 17, టైపిస్టులు 9, రికార్డ్ అసిస్టెంట్లు 8, ల్యాబ్ అసిస్టెంట్లు 2, ఆఫీస్ సబార్డినేట్లు 39, నైట్ వాచ్మెన్లు 1 బదిలీ అయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో కృష్ణ, అకౌంట్ ఆఫీసర్ సామ్యూల్ పాల్, ఏవో రాజరత్నం బాబు పాల్గొన్నారు.

## సబ్సిడీపై కృప కిసాన్ గ్రూపుకు డ్రోన్ పంపిణీ : ఏవో. పి. శిరీష

దుగ్గిరాల, మేజర్ న్యూస్:

మండల పరిధిలోని దేవరపల్లి అగ్రహారంకు చెందిన కృపా కిషన్ గ్రూపుకు 8 0 శాతం సబ్సిడీపై, డ్రోన్ అందజేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి పి .శిరీష తెలిపారు. సోమవారం మండల కార్యాలయంలో కృప కిసాన్ గ్రూపుకు గ్రూప్ సభ్యులు పాముల అయ్యన్నకు ఎంపీపీ షేక్. జబీన్, ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ కె. వివేకానంద, యూనియన్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీ నరేష్, అందజేశారు. ఈ సంద ర్భంగా మండల వ్యవసాయ అధికారి శిరీష మాట్లాడుతూ దుగ్గిరాల మండలం లకు మూడు డ్రోన్లు మంజూరైనాయని. అన్నారు. తక్కువ ఖర్చుతో వ్యవసాయ రంగంలో డ్రోన్, రైతాం గమునకు, పురుగుమందుల పిచికారికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. 80% సబ్సిడీపై రైతాంగానికి డ్రోన్‌ను అందజేయడం ఎంతో




అభినందనీయమని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఇన్చార్జి గోపి తదితరులు పాల్గొన్నారు.

# నేడు తెనాలికి మాజీ సీఎం జగన్ రాక

**తెనాలి, మేజర్ న్యూస్ :**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మంగళవారం తెనాలి రానున్నారు. పోలీసుల అరికాలి కోటింగ్ బాధితుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుండి బయల్దేరి 11.15 తెనాలి చేరుకుంటారు. ఐతానగర్లోని జాన్ విక్టర్ కుటుంబాన్ని పరామర్శించనున్నారు. బాధితుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం తిరిగి ఆయన తాడేపల్లిలోని తమ నివాసానికి చేరుకుంటారు. ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే వైసీపీ నాయకులు మెరుగ నాగార్జున, అన్నాబత్తుని శివకుమార్, అశోక్ కుమార్ తదితర నాయకులు పరిశీలించారు.

# యువకులపై పోలీసుల దాడి హేయం



**తెనాలి, మేజర్ న్యూస్ :**

ఇటీవల దళిత యువకులపై పోలీసులు జరిపిన దాడిని ఖండిస్తున్నట్లు ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.శాంత కుమార్ అన్నారు. జనావాసాలు మధ్య బహిరంగంగా, కర్కసంగా పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అన్నారు. దళిత యువకులు దోమ రాకేష్ చేబ్రోలు జాన్ విక్టర్ షేక్ బాబూలాల్ పై పోలీసులు దాడిచేయడం మానవ హక్కుల ఉల్లంగనే అన్నారు. వారిపై కేసు నమోదు చేయకుండా ముగ్గురు బాధితులను అమానుషంగా హింసించడం పట్ల ప్రజా హక్కులు సంఘాలు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నాయన్నారు. పోలీసులు చర్యలను సమర్థిస్తూ బాధిత యువకులపై ఎలాంటి గాయాలు లేవని తప్పుడు ధృవపత్రాలు సమర్పించిన డాక్టర్లతో పాటు సాక్షులుగా ఉన్న వీఆర్వోలను కూడా సస్పెండ్ చేయాలని అన్నారు. బాధితులకు మద్దతుగా ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ముందుకు రావడం అభినందనీయమని తెనాలి బార అసోసియేషన్ అధ్యక్షులు బేతాళ ప్రభాకర్ అన్నారు. మానవ హక్కుల సంఘం వీటిపై సమగ్రమైన విచారణ జరిపించి పోలీసులను సస్పెండ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు హైకోర్టు అడ్వకేట్ కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ బహిరంగంగా యువకులపై అరికాలు కోటింగ్ ఇవ్వడం అన్యాయమన్నారు. పోలీసులు మధ్య లీకైన వీడియో ద్వారా ఈ ఘటన బయట పడిందన్నారు. మానవ హక్కుల సంఘాలు, దళిత సంఘాలు, ప్రభుత్వం ఈ కేసును సుమోటుగా తీసుకుని పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. తెనాలి కేంద్రంగా జరుగుతున్న గంజాయి స్మగ్లింగ్ వెనుక పోలీసుల పాత్ర ఉందని, స్మగ్లింగ్ రాకెట్ వెనుక పాత్రదారులు, సూత్రదారులను వెలికి తీయాలన్నారు. మానవ హక్కుల సంఘం వీటిపై సమగ్రమైన విచారణ జరిపించి పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవలన్నారు. తెనాలి జేఏసీ అధ్యక్షులు బొనిగల ప్రదీప్ తెనాలి నియోజకవర్గం ఇన్చార్జి కారుమంచి సునీల్ సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాదులు గుంటి సురేష్ బాబు, గుమ్మడి రవిరాజు, కంచర్ల కోటేశ్వరరావు, కనపర్తి కుటుంబరావు, పెనుమాక మధు, దోమ రమేష్ రాంజి తదితరులు పాల్గున్నారు.

# వేసవి విజ్ఞాన తరగతులు



**పెదకాకాని, మేజర్ న్యూస్ :**

పెదకాకాని శాఖ గ్రంథాలయం గ్రంథాలయాధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో 36వ, రోజు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించారు. విద్యార్థినీ,విద్యార్థులకు స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, యోగా, పుస్తక ప్రదర్శన, పుస్తక సమీక్ష, ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. విద్యార్థులకు మోడరన్ డ్రెస్ పోటీలను నిర్వహించడం, వేయించడం నేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించాలి



**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:**

గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదులు – పరిష్కారాలు" కార్యక్రమం జరిగింది. కార్యాలయం కు విచ్చేసిన ప్రజల వద్ద ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలకు చట్ట పరిధిలో తగిన పరిష్కారం చూపుతామని అధికారులు భరోసా ఇచ్చారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధుల ఫిర్యాదుల పట్ల దృష్టి సారించి ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో తగిన న్యాయం అందించాలని పోలీస్ అధికారులకు అదనపు ఎస్పీ లు ఆదేశించారు. జిల్లా నలమూలల నుండీ విచ్చేసిన ప్రజలతో ముగ్గురు అదనపు ఎస్పీ లు మరియు ఇతర పోలీస్ అధికారులు ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. అదనపు ఎస్పీ(క్రైమ్స్) కే.సుప్రజ ఫిర్యాదుదారుల వద్దకు నేరుగా వెళ్లి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణమూర్తి, (అడ్మిన్), కే.సుప్రజ (క్రైమ్స్), హనుమంతుతో పాటు ట్రాఫిక్ డిఎస్పీ రమేష్ మరియు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యోగా శిక్షణ కార్యక్రమం




**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం సోమవారం పిడుగురాళ్ల మండల కమిటీ పిడుగురాళ్ల ప్రభుత్వ కార్యాలయ విభాగాల డాక్టర్ కె మేఘమాల ఆధ్వర్యంలో నిర్వహించారు. యోగా గురువు డాక్టర్ వడ్లమూడి వెంకయ్య యోగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ యోగ చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి యోగ అందించడంను రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గ్రామ సచివాలయ అడ్మిన్ లకు, ప్రజాశక్తి నగర్ లోని యోగా ఔత్సాహికులకు యోగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది డి బాబు, ఎస్ కె వలి పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలలో భాష్యం విద్యార్థులు

**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :**

జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరి ర్యాంకులతో అగ్రస్థానంలో భాష్యం ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 33వ ర్యాంకుతో ఎస్.వెంకటసాయిచక్రి జేఈఈ అడ్వాన్స్డ్ – 2025 ఫలితాలలో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ విద్యార్థులు ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ తెలిపారు. సోమవారం విడుదలైన ఫలితాలలో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ విద్యార్థులు ఎస్.వెంకటసాయి చక్రి ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 33వ ర్యాంకు, ఎం.శ్రీకర గణేష్ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 104వ ర్యాంకు, ఎన్. ఆకాష్ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 108వ ర్యాంకు, టి. విక్రమ్ లెవీ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 146వ ర్యాంకు, డి.జస్వంత్ బాలాజీ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 151వ ర్యాంకు, జి. సాయి మనోజ్ఞ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 152వ ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారన్నారు. అదేవిధంగా వివిధ కేటగిరిలలో ఎస్.వెంకటసాయి చక్రి ఆలిండియా 3వ ర్యాంకు, ఎన్.ఆకాష్ ఆలిండియా 11వ ర్యాంకు, కె. యశ్వంత్ ఆలిండియా 11వ ర్యాంకు, కె.షణ్ముఖ సాయి ఆలిండియా 15వ ర్యాంకు, టి. విక్రమ్ లెవీ ఆలిండియా 21వ ర్యాంకు, డి.జస్వంత్ బాలాజీ ఆలిండియా 22వ ర్యాంకు, పి. లక్ష్మినారాయణ ఆలిండియా 26వ ర్యాంకు, ఎస్.వి.సాయిచక్రి ఆలిండియా 33వ ర్యాంకు, కె. పార్థసారథి ఆలిండియా 36వ ర్యాంకు, సి. హెచ్. దివ్యశ్రీ ఆలిండియా 42వ ర్యాంకు, డి. సుభాష్ ఆలిండియా 48వ ర్యాంకు, ఎస్.కె. అబ్దుర్ రహీమ్ ఆలిండియా 68వ ర్యాంకు, ఎం. సాయితేజ ఆలిండియా 77వ ర్యాంకు, జి.రాధా శ్యామ్ ఆలిండియా 91వ



ర్యాంకు వంటి 100లోపు 14 ఆలిండియా ర్యాంకులు, 200 లోపు 26 ర్యాంకులు, 500లోపు 57 ర్యాంకులు, 1000లోపు 91 ర్యాంకులు, 2000లోపు 124 ర్యాంకులు మరియు 5000లోపు 218 ఆలిండియా ర్యాంకులు సాధించడంతో పాటు ఐఐటి సెలెక్షన్స్లో ఆలిండియా ఆల్టైంది బెస్ట్ నిలిచింద న్నారు. అన్ని పోటీ పరీక్షా ఫలితాలలో ఆల్రౌండర్గా నిలుస్తున్న భాష్యం ఐఐటి అకాడమీ విద్యార్థులను చూస్తే గర్వంగా ఉందని ఈ అద్భుత ఫలితాలను పక్కా ప్రణాళికతో కూడిన మా భాష్యం ఐఐటి ఫౌండేషన్ కరిక్యులమే ముఖ్య కారణమన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ జెఈఈ మెయిన్లో ఓపెన్ కేటగిరిలో 100 పర్సంటైల్తో పాటు ఆలిండియా 18వ ర్యాంకు సాధించిన జి. సాయిమనోజ్ఞకు రూ.5 లక్షలు, జెఈఈ అడ్వాన్స్డ్ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 33వ ర్యాంకు సాధించిన ఎస్.వెంకటసాయిచక్రికి రూ.5 లక్షలు, శ్రీకర గణేష్, ఎన్.ఆకాష్లకు రూ.2 లక్షలు, టి. విక్రమ్ లెవీ, డి.జస్వంత్ బాలాజీలకు రూ. లక్ష చొప్పున ఉన్నత చదువుల నిమిత్తం నగదు ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులను భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేతాము్లు అభినందించారు.

# పెదకాకానిలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం

**పెదకాకాని మేజర్ న్యూస్ :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత కృషి సంకల్ప అభియాన్ లో భాగంగా సోమవారం పెదకాకాని రైతులతో కెవికె శాస్త్రవేత్తల బృందం సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నడుస్తున్న మార్కెటింగ్ సంక్షోభాన్ని తట్టుకునే విధంగా రైతులు వ్యవసాయంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలియజేశారు. ఈ–ఎన్ఏఎం పోర్టల్ లో ప్రతి రైతు తమ పేరును ఉత్పత్తి వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి మార్కెట్లో మధ్యవర్తి భాగస్వామ్యాన్ని తగ్గించి రైతు మంచి ధరకు తమ ఉత్పత్తిని అమ్ముకోవచ్చని కెవికె శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్యలక్ష్మి అన్నారు. రైతుకు అండగా ఉండేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ సబ్సిడీ స్కీములను రైతులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో పంట మార్పిడి చేయడం వలన కృత్రిమ ఎరువులు, పురుగు మందులు వాడటం తగ్గించుకోవాలని, పంట అవశేషాలను పశువుల మేతగా లేదా పొలాల్లో ఎరువుగా వాడాలని,కాల్చివేసే ప్రక్రియను నిలిపివేయాలని



కోరారు. ఆయిల్ ఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ శివ శంకర్ మాట్లాడుతూ భూసార పరీక్షలు ఆధారంగా తమ పొలాల్లో ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టవచ్చునని తెలిపారు. పెదకాకాని మండల వ్యవసాయాధికారిణి పి. సంధ్యారాణి మాట్లాడుతూ పచ్చి రొట్టె విత్తనాలు వితటం ద్వారా భూసారం పెరిగి తదుపరి వేయబోయే పంటకు బలాన్ని చేకూరుస్తుందని రైతులు పచ్చి రొట్టె సాగును చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయ పశువర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పదవి విరమణ సందర్భంగా ఘన సన్మానం

**వినుకొండ, మేజన్ న్యూస్**

వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో టైపిస్టు గా పని చేస్తున్న ఎం.ఏడుకొండలు పదవి విరమణ సందర్భంగా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం మహతి. న్యాయమూర్తి మాట్లాడుతూ కొండలు మృదు స్వభావి అని, అందరినీ ఆప్యాయంగా పలకరించే వారని, మంచి క్రమశిక్షణ తో వారి యొక్క పనిని పూర్తి చేస్తారని తెలిపారు. సీనియర్ టైపిస్టుగా వారి సేవలు మర్చిపోలేనివి అని తెలియజేశారు. పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ పదవి విరమణ పొందిన తర్వాత కుటుంబ సభ్యులతో సంతోషంగా



జీవించాలని తెలియజేశారు. కోర్టులో టైపిస్టుగా పనిచేస్తూ న్యాయవాదులతో కొండలు గారు మంచి అనుబంధం కలిగి ఉంటారని తెలియజేశారు. తన పని తాను చూసుకొని వెళ్లే వారని పలువురు న్యాయవాదులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం శ్రీనివాసరావు, సెక్రటరీ పి గౌస్ మొహిద్దిన్ ఖాన్, వైస్ ప్రెసిడెంట్ పీ వీ రమణారెడ్డి, ట్రెజరర్ వి శివశంకర్ బాబు, సీనియర్ న్యాయవాదులు పి జె లూకా, పి సైదారావు, ఎన్ రామ కోటేశ్వరరావు, టి హనుమంతరావు, వై శ్రీనివాసరావు, ఎస్కే సిద్దయ్య, కె చెన్నకేశవరెడ్డి, ఆరే సామ్రాజ్యం, జె తిరుపతిరావు, కే సుందర్ రెడ్డి,టి ఆంజనేయులు బి శ్రీనివాసులు, కే భాను తేజ, జి అనిల్ కుమార్, ఎం ఎలిషా బాబు, వై శ్రీనివాసరావు, ఎం వి అప్పారావు, వి అమర్ బాబు, ఎన్ అశోక్ బాబు, ఎం సీతారామాంజనేయులు, ఎన్ రామాంజనేయులు, శివా నాయక్, కే చెన్నయ్య, బ్రహ్మం, డి నాగరాజు, ఎం చంటి, టి శంకర్రావు, శ్రీనివాసులు, నందీష్, తదితర సీనియర్,జూనియర్ న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది, ఇతర కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు. సన్మానం అనంతరం అందరికీ ఆత్మీయ విందు ఏర్పాటు చేసినారు.

# పేదల కళ్ళల్లో ఆనందమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం: కన్నా

**సత్తెనపల్లి మేజర్ న్యూస్:**

పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భరోసా నిస్తున్నారని, వారి కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. సోమవారం పట్టణంలోని రఘురాం నగర్, ప్రజావేదిక నందు జరిగిన కార్యక్రమంలో ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను కన్నా లక్ష్మీనారాయణ తో పాటు జడ్పీ చైర్ పర్సన్ కత్తెర హేని క్రిస్టినా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో సీఎం సహాయ నిధి నిర్వీర్యం అయిపోయిందని, గత ఐదు సంవత్సరాలతో పోల్చుకుంటే సత్తెనపల్లి నియోజకవర్గం అభివృద్ధి బాటలో ముందుందన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 81మంది లబ్ధిదారులకు 65 లక్షల 79 వేల 351 రూపాయల విలువ గల చెక్కులను వారు అందజేశారు.సత్తెనపల్లి నియోజక వర్గంలో ఒక సంవత్సర కాలంలోనే 25 కోట్ల రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. రానున్న రోజుల్లో నియో జకవర్గాన్ని ఇంకా అభివృద్ధి చేసి చూపిస్తాం...జడ్పీ నిధుల నుంచి సత్తెనపల్లి నియోజకవర్గానికి 90 లక్షల కేటాయిం చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇంకా పెండింగ్ లో ఉన్న జడ్పీ కి సంబంధించిన వాటికీ త్వరలోనే నిధులు సమకూర్చి అభివృద్ధి పరుస్తామని వారు స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు కొండమోడు- పేరేచర్ల జాతీయ రహదారి విస్తరణ, సత్తెనపల్లి- మాదిపాడు మార్గంలో ఆర్ఓబి నిర్మాణాల పనులను ఏడాది పాలనలోపే ప్రారంభిం చుకున్నట్లు చెప్పారు. కాని శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారా యణ దృష్టి కి కోర్ట్ గురించి న్యాయ వాదులు తీసుకుని వెళ్లగా, ఆయన సకాలంలో స్పందించి జిల్లా పరిషత్ చైర్మన్ హేని క్రిష్టీనా తో న్యాయస్థాన భవనాలు కట్టుకోవాలి అంటే స్థల సేకరణ చేయాలని నరసరావుపేట రోడ్డు లోని జడ్పీ సైట్ ని పరిశీలించి దానిని న్యాయస్థానం భవనాలకు 2.60 సెంట్ల భూమిని జడ్పీ చైర్మన్ తో మాట్లడి కేటాయించారని న్యాయ వాదులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరు అజయ్ కుమార్ ఆధ్వర్యంలో క్రిష్టీనాను ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలలో శ్రీ చైతన్య ప్రభంజనం

గుంటూరు మేజర్ న్యూస్ : ప్రభుత్వం ప్రకటించిన ఆల్ ఇండియా జేఈఈ అడ్వాన్స్ 2025 ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థలలో ఆల్ ఇండియా కేటగిరిలో 1, 3, 5, 6, 11 ర్యాంకులు వచ్చాయనిఎగ్జిక్యూటివ్ ఏజియమ్ దుర్గా ప్రసాద్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జె ఈ ఈ లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి సీనియర్ ఫాకల్టీ ని నియమించి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నట్లు అయన వెల్లడించారు. గుంంటూరు జోన్ నుండి అన్ని కేటగిరిలో కలిపి ఎన్ హేమంత్ అభిరామ్ (256021152) 48వ ర్యాంకు, బి రుద్ర తేజ (256022135) 3095, బి రాజు నాయక్ (256022078) 3785, జి వైష్ణవి (256037035) 4055 , కె హర్ష వర్ధన్ (256016006) 4145 , ఎండీ తబిష్ అయిమాన్ (256018042) 6745 ర్యాంకు లతో పాటుగా 1000 లోపు 21 మంది, 2000 లోపు 34 మంది, 5000 లోపు 66 మంది, 10000 లోపు 127 మంది సాధించారు. ఈ ర్యాంకులు సాధించిన



విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ అభినందిం చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎగ్జిక్యూటివ్ ఏజియమ్ దుర్గా ప్రసాద్, డీన్స్ సురేష్, చంద్రశేఖర్, క్రిష్ణ అసోసియెట్ డీన్ హరిబాబు, ఏజియమ్ ఎల్ టీసీ శ్రీనివాస్, అన్ని క్యాంపస్ల ప్రిన్సిపల్స్ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, వారి పేరంట్స్ కు ఆధ్యాపకులు అభినందనుల తెలియజేసినారు.

# ఐ ఐ టి జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో ఎస్ ఆర్ కళాశాల విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

**గుంటూరు సిటీ మేజర్ న్యూస్:**

విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల నైపుణ్యం, కాలేజ్ యాజ మాన్యం రూపొందించిన ప్రోగ్రాంల సమిష్టి ఫలితమే జె.ఇ.ఇ లో, తమ విద్యార్థుల అసాధారణ ర్యాంకులకు కారణమని ఎస్.ఆర్.విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి అన్నారు. సోమవారం ప్రకటించిన ఐ.ఐ.టి-జెఇఇ అడ్వాన్స్ 2025 ఫలితాలలో ఎస్.ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డి.జి.యం రమణ,కో - ఆర్డినేటర్ అరవింద్ మాట్లాడుతూ అత్యంత నాణ్యత, విలువలతో కూడిన విద్యను సామాన్య విద్యార్థులకు అందే విధంగా చూడడం ద్వారానే ఎన్.ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని అన్నారు.ఆంధ్రా,తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలలో ఉన్న ఎస్.ఆర్ విద్యాసంస్థలలోని విద్యార్థులలో గుంటూరు బ్రాంచి విద్యార్థులు ఉత్తమ ఫలితం సాధించారని చెప్పారు.ఫోకస్ ప్లస్,ఫోకస్ ప్రోగ్రాంల ద్వారా 10వ తరగతి వరకు సాధారణంగా ఉన్న విద్యార్థులను కూడా జె.ఇ.ఇ.పరీక్షలలో మంచి ఫలితాలు సాధించే విధంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో వివిధ కేటగిరిలలో యమ్. రవిచంద్రారెడ్డి (8వ ర్యాంకు)వి. నాగసిద్ధార్ధ (13వ ర్యాంకు)పి. సాక్షి (40వ ర్యాంకు)ఎ. అనుశ్రీ (47వ ర్యాంకు)భానావత్ సాయి (68వ ర్యాంకు) వై. భరణి శంకర్ (90వ ర్యాంకు) సాధించా రని చెప్పారు. టి. తేజన్ ఉధవరెడ్డి గుంటూరు బ్రాంచి నుండి ఆలిం డియా ఓపెన్ కేట గిరిలో 662వ ర్యాంకు సాధించాడని చెప్పారు. ఇవే కాకుండా సుమారు 40 మంది విద్యా ర్థులు దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ ఐ.ఐ.టి లలో సీటు సంపాదించే ర్యాంకులు పొందారన్నారు.మంచి ఫలితాలు సాధించి ఎస్.ఆర్ విద్యాసంస్థల ప్రతిష్టను పెంచిన విద్యార్థులను, అధ్యాప కులను డైరెక్టర్ సంతోష్ రెడ్డి,సి.ఇ.ఓ, సురేందర్ రెడ్డి,జి.యం, రాజేంద్రప్రసాద్,డి.జి.యం గోవర్ధన్ రెడ్డి అభినందించారు.ఈ సమావేశంలో జోనల్ ఇన్చార్జి పూర్ణ చంద్రరావు,డీన్లు అప్పిరెడ్డి,అశోక్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ సురేష్,ఉదయ్ పాల్గొని విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు.





# సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్వోలను కలిసిన సిపిఐ పార్టీ నాయకులు

**వినుకొండ, మేజర్ న్యూస్ :**



సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని పట్నంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు, ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మాణం కొరకు ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈరోజు వినుకొండ నియోజకవర్గంలోని5 మండలాల్లో, వినుకొండ మున్సి పాలిటీలో, వినుకొండ మండలం, శావల్యాపురం మండల, నూజెండ్ల మండ లం, ఈపూరు మండలం, బొల్లాపల్లి మండలం,సిపిఐ పార్టీ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్ సిపిఐ పార్టీ వినుకొండ నియోజకవర్గం కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు వినుకొండ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము మండల కార్యదర్శి ఏ పవన్ రాయబారం వందనం, పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, ఊట్ల రామారావు, కొప్పెరపు మల్లికార్జున మస్తాన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయాలంటూ సిపిఐ ఆధ్వర్యంలో వినతి

**నరసరావుపేట మేజర్ న్యూస్ :-**



అర్హులైన నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయాలంటూ సోమవారం సిపిఐ మండల శాఖా ఆధ్వర్యంలో స్థానిక తహ సీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వము వచ్చి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని అన్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తామని చెప్పి ఒక పథకం కూడా అమలు చేయలేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు 3సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు 2సెంట్లు చొప్పున ఇళ్ళ స్థలాలు పంపిణీ చేస్తామని చెప్పి ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వము ఎన్నికలలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను, హామీలను అమలు చేయాలని, అర్హులైన నిరుపేదలకు ఇళ్ళ స్థలాలు పంపిణీ చేయాలని అన్నారు. లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ బి.నిర్మలకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి జమ్ములమూడి వెంకటేశ్వర్లు, సిపిఐ సీనియర్ నాయకులు తానం మత్తయ్య, సిపిఐ మండల నాయకులు పిడెం హుస్సేన్, ముప్పూరి మధుసూదనరావు, తన్నీరు కోటయ్య, వెన్నా గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టిఫిన్ బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు పంపిణీ

**- మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు**

**మంగళగిరి మేజర్ న్యూస్:**



ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ మంగళగిరి మండలం నవు లూరు గ్రామానికి చెందిన చిరు వ్యాపా రులకు, రిక్షా కార్మికులకు చేయూత నందించారు. నవులూరు గ్రామానికి చెందిన కొవ్వూరి ఆదిలక్ష్మి, రంగిశెట్టి ఉమాదేవి, కూరపాటి గోపి, బడిగం చుల వెంకటరమణ, దేవన వెంకట సుబ్బమ్మకు టిఫిన్ బళ్లుఅందించగా బనాల దాసు, కంకనాల నరసింహరావులకు ప్లాట్ ఫామ్ రిక్షాలను స్థానిక నాయకులు సోమవారం పంపిణీ చేశారు. తమకు బళ్లు అందజేయాలని మంత్రి నారా లోకేష్ ని కోరగా వెంటనే స్పందించిన ఆయన స్థానిక నాయకుల చేతుల మీదుగా బళ్లను అందజేయించారు. టిఫిన్, రిక్షా బండ్లు ఉచితంగా ఇచ్చి మా కుటుంబాలకు మంత్రి నారా లోకేష్ ఎంతో మేలు చేశారని లబ్ధిదారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్ధసారథి మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో లబ్ధిదారులకు టిఫిన్ బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేసినట్లు చెప్పారు. తమకాళ్ల మీద తాము నిలబడుతూ ఉపాధి పొందుతున్న బడుగుజీవులకు తోడ్పాటు అందించాలని మంత్రి నారా లోకేష్ సొంత సొమ్ముతో టిఫిన్, తోపుడు బండ్లను, ప్లాట్ ఫామ్ రిక్షాలను తయారు చేయించి ఉచితంగా అందజేస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ కుల, మతాలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, గ్రామ పార్టీ అధ్యక్షులు రుద్రు కోటేశ్వరరావు, కొల్లి వెంకట్రావు, బత్తుల నాగరాజు, తోట శ్రీనుబాబు, రుద్రు శ్రీనివాసరావు, షేక్ నజీర్, మర్రి ఏసుబాబు, దేసబోయిన వెంకట్రావు, కొత్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# స్వరనీరాజనానికి పోటెత్తిన జనం..



## ఎస్పీ బాలసుబ్రమణ్యం కళా పరిషత్ పేరుతో మాచర్లలో కనీవినీ ఎరుగని రీతిలో సినిమా పాటల పోటీలు

**మాచర్ల ప్రతినిధి మేజర్ న్యూస్ :**

గాన గంధర్వుడు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం 79 వ జయంతిని పురస్కరించుకొని మాచర్ల పట్టణంలో డా. ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఆదివారం నిర్వహించిన "స్వరనీరాజనం" తెలుగు సినిమా పాటల పోటీలకు జనం పోటెత్తారు. ఆదివారం ఉదయం నుండి ప్రారంభమైన ఎంపికకు జిల్లా స్థాయిలో ఇప్పటి వరకూ ఎన్నడూ లేని విధంగా వివిధ ప్రాంతాల నుండి 150 మంది గాయనీ గాయకులు పాల్గొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియ ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. ఎంపికైన వారితో అనంతరం రెండు గంటల విరామం తర్వాత పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు సోమవారం తెల్లవారుజాము మూడు గంటల వరకు కొనసాగాయి. ఈ కార్యక్రమాన్ని డా. ముటుకుల కమలాసన్ ప్రారంభించి కొనసాగించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షులు కొత్తమాసు



శ్రీరామమూర్తి మాట్లాడుతూ మాచర్ల పట్టణంలో మొట్టమొదటిగా డా. ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన "స్వరనీరాజనం" పాటల పోటీలకు విచ్చేసిన గాయనీ గాయకులందరికీ ఆయన కళా పరిషత్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా పాటల పోటీల కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి 10000 వేల రూపాయలను విజయవాడకు చెందిన ఎమ్మెస్ శివ బాబు, ద్వితీయ బహుమతి 7000 రూపాయలను వి ఆనందరావు, తృతీయ బహుమతిరూ. 5 వెలను కె యం నాయుడు, నాలుగవ బహుమతి రూ. 4 వేల ను బి. కోటేశ్వరరావు, ఐదవ బహుమతి రూ. 3. వేలను వేజెండ్లకు చెందిన వెంకటేశ్వర్లు గెలుపొందారు. వారితో పాటుగా మరో 35 మంది గాయనీ గాయకులకు వెయ్యి రూపాయల కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. అంతేకాకుండా లక్కీ డ్రా ద్వారా పది మంది మహిళలకు వెయ్యి రూపాయల ఖరీదు చేసే చీరలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది పదవ తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన పదిమంది విద్యార్థులకు కళా పరిషత్ తరపున జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ మాట్లాడుతూ మాచర్లలో మునుపెన్నడూ లేని విధంగా ఎస్పీ బాలసుబ్రమణ్యం కళా పరిషత్ పేరుతో నిర్వహించిన "స్వరనీరాజనం" పాటల పోటీలకు విశేష స్పందన లభించిందని అన్నారు. ఎప్పుడూ కక్షలు కార్పణ్యాలతో ఉండే పల్నాడు ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఆనందింప చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన అధ్యక్షులు కొత్త మాసు శ్రీరామమూర్తిని, ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్ జాన్ ఖాన్, జాయింట్ సెక్రెటరీ పులుసు శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులు బాహాటం శేషగిరి రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరుగంటి చెన్నకేశవరావు, కార్యవర్గ సభ్యులు కాశిబోయిన శివశంకర్, గట్ల కోటిరెడ్డిలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిగొడుపు నరసరాజు వ్యాఖ్యాతగా వ్యవహరించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీనియర్ జర్నలిస్ట్ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విద్యాధరణి మురళి ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. కార్యక్రమం ఆద్యంతం ఆయన పాటల పోటీలను తిలకించి ఆనందించారు. ఈ కార్యక్రమంలో చుండూరు వెంకటేశ్వర్లు, కుర్రి శాయిమార్కొండా రెడ్డిలు కూడ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర కోశాధికారి విద్యాధరణి నరసరాజు, కృష్ణవేణి జూనియర్ కాలేజ్, ఎస్ వి ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ యనమదల వెంకటరామయ్య, ఆక్స్ఫర్డ్ స్కూల్స్ మాజీ ప్రిన్సిపల్ సైకాలజిస్ట్ ఎంబిఎస్ కోటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, లైన్స్ క్లబ్ రోటరీ క్లబ్ న్యాయవాదులు, డాక్టర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పోటీలకు హైదరాబాదుకు చెందిన రాజగోపాల్, కళ్యాణి, విశ్వేశ్వరరావు, గొట్టిపాటి రామారావు లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

## రాష్ట్ర ప్రభుత్వం పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

**-సిపిఐ మండల కార్యదర్శి సీనియర్ నాయకులు ఊట్ల రామారావు**



**ఈపూరు మేజర్ న్యూస్:**

కూటమి ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి సీనియర్ నాయకులు ఊట్ల రామారావు డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని చెప్పి డిమాండ్ చేస్తూ స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారని, గతంలో ఒక సెంటు పేద ప్రజలను ఉద్ధరించినట్లుగా చెప్పుకున్నాడని జగన్మోహన్ రెడ్డిని విమర్శించిన కూటమి ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేకమంది ఇల్లు లేని పేద ప్రజలు ఉన్నారని పేద ప్రజల తరపున సిపిఐ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చెయ్యలేదని, ఒక పింఛన్ మాత్రమే ఇచ్చి ప్రజా ఆర్భాటాలు తప్ప మిగతా హామీలు అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ, 5లక్షలు మంజూరు చేసి ,సొంతింటి కళ ను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నళినికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు మహిళలు పాల్గొన్నారు.

# ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :-**

ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక,ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 63 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదు దారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు.



## రైతు సమస్యలను పరిష్కరించాలి



**- సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు**

**పెదకాకాని మేజర్ న్యూస్ :-**

మండలంలో రైతులు కౌలు రైతులు,వ్యవసాయ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. సోమవారం తహసిల్దార్ పి.కృష్ణకాంత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఏ పంటకు గిట్టుబాటు ధర అందలేదని అదేవి ధంగా మార్కెట్లో ధరలు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయ న్నారు. దళారుల చేతిలో రైతులు దగా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని నమ్ముకున్న రైతులు సేద్యం చేసి గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై బలవన్మరణాలకు పాల్పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ ప్రతి కౌలు రైతుకు, ఇవ్వాలని,కౌలు చట్టంలో సమూలమైన మార్పులు చేసి యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డును ఇచ్చి పంట భూములు మంజూరు చేయాల న్నారు. దేవాదాయ భూముల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలన్నారు.రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కనీస ధర కల్పించి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు వెంటనే బకాయిలు చెల్లించి వారి పని దినాలు సంవత్సరానికి 200 రోజులు తగ్గకుండా కనీస వేతనం రూ. 600 ఇవ్వాల న్నారు. వాటి మరమ్మతులకు తక్షణమే చర్యలు చేపట్టాలని తాసిల్దార్ కృష్ణకాంత్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఎస్. నీలాంబరం,బి.బాబురావు, కె. సత్యనారాయణ, వి.శివయ్య, కె.రంగారెడ్డి రైతులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామ ఉత్తర్వులు అందజేత



**గుంటూరు, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం జరిగిన కారుణ్య నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ ఇద్దరికి నియామక ఉత్తర్వులు అందించారు. వీరిలో తాడిశెట్టి ఎస్ ఎన్ కే కుమార్ కు పోలీస్ శాఖలో, బుళ్ల శృతికి రెవెన్యూ శాఖలో జూనియర్ ఆఫీసు అసిస్టెంట్లుగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను అందించారు ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ నిబద్ధతతో, అంకితభావంతో ప్రభుత్వ సర్వీసును క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారి, ఆర్డిఓ శ్రీనివాస రావు, జెడ్పి సిఇఓ జ్యోతిబసు, డ్వామా, డీఆర్డీఏ, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు శంకర్, విజయలక్ష్మీ, ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, డిపిఓ బి.వి.నాగ సాయి కుమార్, జిల్లా ఉద్యాన అధికారి రవీంద్ర, ఎస్.ఈ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య, డిఎస్ డబ్ల్యూ ఎస్ మోహన్, డియం అండ్ హెచ్ ఓ డా. విజయలక్ష్మీ, సిపిఓ శేషశ్రీ, ఏపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ ఎండి.నజీమా బేగమ్, ఎల్ డి ఎం మహిపాల్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పూర్ణచంద్రరావు, తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

### మంత్రి పార్థసారధి

**గుంటూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందిస్తామని మంత్రి పార్థసారధి చెప్పారు. 2014లో సీఎం చంద్రబాబు హయంలో 21వేల అక్రిడిటేషన్ కార్డులు అందిస్తే, గత ప్రభుత్వం కేవలం 12 వేలు మాత్రమే ఇచ్చిందని మంత్రి చెప్పారు. అర్హులైన అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలనే ఉద్దేశంతో మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ప్రభుత్వం నియమించిందని, పూర్తిగా అధ్యాయనం చేసిన తరువాత ఈ క్యాబినేట్‌లో గానీ, వచ్చే క్యాబినేట్‌లోని చర్చించి వీలైనంత త్వరగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి

### అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జి కలెక్టర్ - 206 ఫిర్యాదులు స్వీకరణ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని, ఎలాంటి సందర్భంలో కూడా బియాండ్ ఎస్-ఎల్ఏ లోకి వెళ్లకూడదని ఇన్చార్జ్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఇన్చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు , లక్ష్మీ కుమారి , స్టెప్ సిఇఓ ఆర్. చంద్రముని , ఆర్డిఓ శ్రీనివాస రావు ప్రజల నుండి 206 పిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో ఇన్చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన పిటీషన్లను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. మరో 24 గంటల్లో గడువు ముగిసే పిటీషన్లు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్ళకుండా ముందుగా పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను ఇన్చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ సమీక్షించి సూచనలు చేసారు. పెండింగ్ లో వున్న కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు.



లోకాయుక్తాకు పంపిన కేసులు అబ్జెక్షన్పై వెనక్కి తిరిగి వస్తున్నాయని, కేసులకు సంబంధించి అబ్జెక్షన్పై లేకుండా కౌంటర్లు దాఖలు చేయాలన్నారు. పీజీఆర్ఏస్ నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు కొన్ని ముఖ్యమైన అంశాలు తెలియజేశారని తెలిపారు. అర్జీదారుని పిర్యాదును సరిగా ఎండార్స్ చేయడం లేదని, సంబంధిత శాఖలో సరైన అధికారికి పంపడం లేదని , పై అధికారులు తనిఖీలు నిర్వహించకుండా క్రింది స్థాయి అధికారుల స్థాయిలోనే పరిష్కరించడం జరుగుతుందని , గ్రీవెన్స్ రెడ్రసల్ అధికారులే సమస్యను పరిష్కరించాలని , అర్జీదారుని సమస్యను పరిష్కరించిన విధానాన్ని క్షుణ్ణంగా తెలియజేయాలని , అధికారి యొక్క పనితీరు మీద ఫీడ్ బ్యాక్ అందించాలన్నారు. అర్జీదారుని దరఖాస్తుని రిజిస్టర్ లో తప్పక నమోదు చేయాలన్నారు. కేటగిరి వైజ్ , మండల , జిల్లా స్థాయిలలో యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను తయారు చేసుకోవాలని , అర్జీ రిపీట్ అయితే ప్రక్కన పెట్టాలన్నారు. ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు కృషి చేయాలన్నారు. బాల కార్మికులను గుర్తించి వారిని స్కూల్స్ లో చేర్పించాలన్నారు. 14 సంవత్సరాల లోపు పిల్లలు బడి బయట వుండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చైల్డ్ లేబర్ టాస్క్ ఫోర్స్ కమిటీ లకు జిల్లా అధికారులు సహకరించాలన్నారు. జిల్లాను డ్రాప్ అవుట్ జిల్లాగా వుంచాలన్నారు. యోగాంధ్ర - 2025 కార్యక్రమాలలో అధికారులందరు తప్పని సరిగా పాల్గొనాలన్నారు. ఈ నెల 4 వ తేదిన జీయంసీ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా యోగా కార్యక్రమం స్థానిక ఎన్ టీ ఆర్ స్టేడియం వద్ద నిర్వహించడం జరుగుతుందని , జిల్లా అధికారులు , సిబ్బంది అందరు ఖచ్చితంగా కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డ్వామా , డీఆర్డీఏ , హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు శంకర్, విజయలక్ష్మీ , ప్రసాద్ , డిపిఓ బి.వి.నాగ సాయి కుమార్ , ఎస్.ఈ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య , డిఎస్ డబ్ల్యూ ఎస్ మోహన్ , జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు , జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర , సిఇఓ శేషశ్రీ , డియం అండ్ హెచ్ ఓ డా. విజయలక్ష్మీ , ఎల్ డి ఎం మహిపాల్ రెడ్డి తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ సభ్యునికి రూ.5 లక్షలు చెక్కు అందజేత

**గుంటూరు జిల్లా క్రైమ్, మేజర్ న్యూస్:** ప్రమాదవశాత్తు మరణించిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యుడు ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన నక్కా అలెక్స్ కుటుంబానికి జనసేన పార్టీ తరపున రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును సోమవారం దించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ నాగబాబు చెక్కు మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ



సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలకు జనసేన పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎప్పుడు పార్టీ కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచిస్తూ ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి దేగల లక్ష్మణ్, వట్టిచెరుకూరు మండలం అధ్యక్షుడు పత్తి భావన్నారాయణ, నియోజకవర్గ నాయ కులు నాగినేని సునీల్, ముట్లూరు గ్రామ సీనియర్ నాయకులు పత్తి పాపారావు, గేరా రాజేష్, రవి పాల్గొన్నారు.

18 వసంతాల 'నేటి దినపత్రిక సూర్య' మహాయజ్ఞంలో
'నేటి దినపత్రిక సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో
అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను
అధిగమించింది. ఈ ప్రస్థానంలో
సూర్యాక్షరంతో మమేకమైన 'నేటి దినపత్రిక సూర్య'
కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు.
మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు పేరుపేరునా
కృతజ్ఞతాభివందనాలు.
ఇట్లు... పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.
సెల్ : 9705554777

నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. సరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

| | | |
|---|---|---|
| పి. బాలు (చిన కొండయ్య)<br>బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా.<br>సెల్ : 9705554777 | జి.శ్రీనివాసరావు<br>గుంటూరు జిల్లా ఇన్‌చార్జి<br>సెల్ : 9959426987 | ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.)<br>స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా.<br>సెల్ : 8897455466 |

| | | | |
|---|---|---|---|
| ఎం.ఏడుకొండలు<br>సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి<br>సెల్ : 9030880455 | జి.హిరన్మాయి(కన్నల్)<br>నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి<br>జిల్లా క్రైమ్ రిపోర్టర్ | ఆళ్ల వీరభద్రరావు(భద్రం)<br>గుంటూరు జిల్లా క్రైం రిపోర్టర్<br>సెల్ : 9848411984 | చెట్టిపోగు కాశి<br>దాచేపల్లి రిపోర్టర్<br>సెల్ : 9963343327 |
| శేషగిరి రాజు<br>మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి<br>సెల్ : 8341408201 | వై.ఏసుబాబు<br>గురజాల ఆర్సీ ఇన్‌చార్జి<br>సెల్ : 9701250872 | బి.పూర్ణచంద్రరావు<br>సత్తెనపల్లి రిపోర్టర్<br>సెల్ : 9866246951 | చెవుల రంగారావు<br>మెడికల్ రిపోర్టర్, గుంటూరు<br>సెల్ : 9490544635 |
| యం.కృష్ణ<br>మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 9393309149 | వి.రవికుమార్<br>తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 99083 38200 | డి. చైతన్య<br>వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి<br>సెల్ : 9381968453 | ఎస్.కె.రఫీ<br>చిలకలూరిపేట ఆర్సీ ఇన్‌చార్జి<br>సెల్ : 99493352147 |
| జి.ఏలియా<br>ముప్పాళ్ళ రిపోర్టర్<br>సెల్ : 9392231959 | బి.సాంబశివరావు<br>రాజుపాలెం రిపోర్టర్<br>సెల్ : 9949382676 | రమేష్<br>దుగ్గిరాల రిపోర్టర్<br>సెల్ : 9866782780 | ఎస్.వెంకటేశ్వర్లు<br>పెదకాకాని రిపోర్టర్<br>సెల్ : 9948175840 |
| కె.నాగరాజు<br>రిపోర్టర్, గుంటూరు<br>సెల్ : 7799881000 | డి.రమేష్<br>ఈపూరు రిపోర్టర్<br>సెల్ : 9110734898 | పి.లక్ష్మీనారాయణ<br>నూజెండ్ల రిపోర్టర్<br>సెల్ : 9666474953 | ఎస్.కె. రవూఫ్<br>శావల్యాపురం రిపోర్టర్<br>సెల్ : 7989434737 |
| అక్కిరెడ్డి<br>నరసరావుపేట మెడికల్ రిపోర్టర్<br>సెల్ : 9849134987 | లక్ష్మీనారాయణ<br>రెంటచింతల రిపోర్టర్<br>సెల్ : 800079075 | వి.వెంకటరెడ్డి<br>బొల్లాపల్లి రిపోర్టర్<br>సెల్ : 80191 99991 | పి.వెంకటేశ్వర్లు<br>దుర్గి రిపోర్టర్<br>సెల్ : 8185815858 |
| టి.శ్రీకాంత్<br>వెల్దుర్తి రిపోర్టర్<br>సెల్ : 9912818723 | ఎస్.విజయభాస్కర్<br>గుంటూరు రిపోర్టర్<br>సెల్ : 9440822538 | షేక్ నాగూర్<br>నకరికల్లు రిపోర్టర్<br>సెల్ : 98489 26300 | ఎం.కోటేశ్వరరావు<br>మాచవరం రిపోర్టర్<br>సెల్ : 6303775169 |
| సి.హెచ్.ప్రసాద్<br>గుంటూరు సిటీ రిపోర్టర్<br>సెల్ : 8125309319 | పి.ఆనంద్<br>వినుకొండ రూరల్ రిపోర్టర్<br>సెల్ : 8125125239 | జి.బాలాజీ<br>తాడికొండ రిపోర్టర్<br>సెల్ : 9603424824 | రమేష్<br>నరసరావుపేట రూరల్ రిపోర్టర్<br>సెల్ : 7075942600 |
| తేళ్ల రవీంద్రబాబు<br>గుంటూరు రిపోర్టర్<br>సెల్ : 7396234032 | డి.మల్లికార్జునరావు<br>యడ్లపాడు రిపోర్టర్<br>సెల్ : 8309237441 | "నేటి దినపత్రిక సూర్య"<br>ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు. | |